క్లుప్తంగా

త్రినాథస్వామి ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హిరమండలం: మండలంలోని అంబావల్లి గల త్రినాథస్వామి ఆలయంలో ఆదివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఉత్స విగ్రహాలను ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో వచ్చే ఆదివారాల్లో త్రినాథ స్వామి (వ్రతం) ఉత్సవాలు నిర్వహించడం ఆనవాతీగా వస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

180 మందికి వైద్య సేవలు



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు సదాశివ

హిరమండలం: పాతపట్నంలోని శివశంకర్ కాలనీలో రేగేటి షన్ముఖరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 180 మందికి డాక్టర్ జి.సదాశివ వైద్య సేవలను అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. భుజంగరావు, శివాజీ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి కొత్తగా ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ బదిలీపై వచ్చారు. వీరు ఆదివారం బాధ్యతలు స్వీకరించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ కాళీచరణ్ తెలిపారు. పొందురు నుంచి పి.అనూష, డీసీహెచ్ ఆఫీస్ నుంచి ప్రసన్న కుమార్ సీనియర్ అసిస్టెంట్లుగా బాధ్యతలు చేపట్టారు. సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా ఆమదాలవలస నుంచి వై.ఆదిలక్ష్మి ఇక్కడకు వచ్చారు.

మాజీ ఉప సర్పంచ్ మృతికి సంతాపం



తాడేల కృష్ణవేణి (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు తాడేల కృష్ణవేణి (60) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. కృష్ణవేణి అదనపు డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్ తల్లి. ఈమె మృతి పట్ల మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, నరసన్నపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు సురంగి నర్సింగరావు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, ఎంపీటీసీ నడిమింటి లక్ష్మి, తదితరులు సంతాపం తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


రహదారి ప్రారంభం



రహదారిని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

పోలాకి: మండలంలోని దీర్ఘాశి గ్రామంలోని కాలనీ నుంచి దుర్గాగిరికి రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదివారం ప్రారంభించారు. దీర్ఘాశిలో గల దుర్గాగిరి భగవతి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తిపీటతో దాడి



గాయపడిన రాము

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెం గ్రామంలో ఇటుకబట్టీ యజమాని యు.రాముపై ఆయన దగ్గర పనిచేసే వ్యక్తి జనార్దన్ ఆదివారం దాడి చేశాడు. ఇటుకబట్టీ యజమాని ఇంట్లో లేని సమయంలో భార్య లతను జనార్దన్ కొట్టాడు. భర్త ఇంటికి వచ్చిన తరువాత ఆమె ఈ విషయం తెలియజేసింది. తన భార్యను ఎందుకు కొట్టావని జనార్దన్‌ను రాము అడగడంతో కత్తిపీటతో దాడిచేశాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు రామును పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సచివాలయ సేవలకు గ్రహణం!

- కూటమి ప్రభుత్వంలో బోసిపోయిన సచివాలయాలు
- ఏడాది కావస్తున్నా అందని సేవలు
- రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు అందక తిప్పలు



కొరసవాడ గ్రామ సచివాలయం

పాతపట్నం: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేశారు. ప్రతీ సచివాలయానికి 15 మంది వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కింది. పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారు. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ ఊదరగొట్టారు కూటమి నాయకులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను పక్కన పెట్టి ప్రజల సేవలకు కొతలు పెట్టారు. నాడు కళకళలాడిన సచివాలయాలు నేడు సేవలు అందక బోసిపోయాయి. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. సచివాలయాల సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వెబ్ సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఎన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సేవలు ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రూ.40 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టింది. పాతపట్నం నియోజకవర్గంలో 92 సచివాలయాలు ఏర్పాటు చేశారు. సచివాలయానికి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలను ప్రజలకు నేరుగా అందజేశారు. ప్రజలకు వీలున్నప్పుడే సమస్యలను విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతోపాటు విద్య, వైద్యం, పోలీస్, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ తదితర సేవలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు పల్లెల్లోనే పొందేవారు. కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

పాతపట్నం నియోజకవర్గంలోని సచివాలయాలు, గ్రామాల వివరాలు					
మండలం	పాతపట్నం	మెళియాపుట్టి	కొత్తూరు	హిరమండలం	ఎల్.ఎన్.పేట
సచివాలయాలు	18	22	27	13	12
గ్రామాలు	118	164	138	86	63

దిష్టిబొమ్మల్లా మారాయి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాయాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో సచివాలయాలన్నీ దిష్టిబొమ్మల్లా మారాయి. ఎన్నికల్లో చెప్పిన హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదు. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు, సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.

– పదాల రంజిత్, గంగువాడ, పాతపట్నం మండలం

అందుబాటులోకి తీసుకురావాలి



సచివాలయాల్లో రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులతోపాటు నూతన పింఛన్ దరఖాస్తు వెబ్ సైట్లు తెరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా.. ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. సచివాలయాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది.

– మురళీ అప్పో, సీతారాంపల్లి, పాతపట్నం మండలం

సంక్షేమ పథకాలు అమలు చేసేదెప్పుడు?



శిమ్మ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

ఎల్.ఎన్.పేట: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎల్.ఎన్.పేట మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జూన్ నుంచి మరో ఖరీఫ్ వరి సాగు సీజన్ ప్రారంభం అవుతుందని, రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు ఈ ఏడాదైనా ఇస్తారా అన్న అనుమానం వ్యక్తమవుతుందన్నారు. వేసవి సెలవులు అనంతరం జూన్ రెండో వారంలో పాఠశాలలు తెరుస్తారన్నారు. ఈ ఏడాదికైనా తల్లికి వందనం పథకం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు, హామీల పేరుతో ప్రజలను కూటమి నాయకులు మోసం చేశారన్నారు. పథకాల డబ్బులు వస్తాయని పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముందుగా చెప్పిన ప్రకారం పథకాల డబ్బులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమచేశారని గుర్తుచేశారు.

ఈశ్వరరావు మృతికి సంతాపం

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి ఆదివారం ఈశ్వరరావు మృతికి సంతాపం తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఎల్.ఎన్.పేట: భూసారం పెంచేందుకు దోహదపడే పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఏఓ పైడి లతశ్రీ ఆదివారం తెలిపారు. జీలుగు విత్తనాలకు 50 శాతం రాయతీ పోను కిలో విత్తనాలు రూ.61.50, కట్టెజనుము కిలో రూ.54.50, పిల్లి పెసర రూ.90లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి సుమారుగా 30 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయన్నారు. పది కిలోల ప్యాకేజీల్లో విత్తనాలు లభిస్తున్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ఆలయాల నిర్మాణంతో భక్తిభావం



ధర్మాన కృష్ణదాస్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: గ్రామాల్లో ఆలయాల నిర్మాణం వల్ల ప్రజల్లో భక్తిభావం ఏర్పడుతుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం సైరిగా పంచాయతీ లింగన్నాయుడుపేటలో నూతనంగా నిర్మాణం చేపట్టిన అభయాంజనేయ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ఏర్పాటు వల్ల లోక కల్యాణం జరుగుతుందన్నారు. కృష్ణదాస్‌ను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, పార్టీ జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ధర్మాన జగన్, సర్పంచ్ ధర్మాన అనిత, పి.ముసలినాయుడు, ఎంపీటీసీ వెలమల అసిరినాయుడు, సర్పంచ్‌లు, నాయకులు తాడేల త్రినాథరావు, ధర్మాన వెంకటరమణ, కల్యాణం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.31 వేల ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్

పొందూరు: ఈ నెల 21న సాక్షిలో ప్రచురించిన 'దేవుడి మీదే భారం' అనే వార్తకు రాజాం మండలంలోని డోలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు స్పందించారు. మలకాం గ్రామానికి చెందిన శివాలయం పూజారి విబూది నీలకంఠంకు రూ. 31 వేల నగదును ఆదివారం అందజేశారు. తలకు ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతలను సహాయం చేయాలని నీలకంఠం కోరారు.



నీలకంఠంకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థి

ఆర్థికసాయం అందించిన వారిలో ఎ.ఆర్.కె.రంగారావు, మాచెర్ల జగదీష్, టంకాల సోమశేఖర్, వావిపల్లి శ్రీకాంత్, మోహన్‌గాంధీ, వేమకోటి రవి, జి.వి.ఎస్.అప్పారావు, రాంబాయి, బత్తుల చంద్రశేఖర్, వాసు, తదితరులు ఉన్నారు.

కానరాని కాడెడ్లు

- యంత్రాల ద్వారానే సేద్యం
- పొలం పనులు లేక వ్యవసాయ కూలీలు ఇతర పనులకు..



ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

హిరమండలం: కొన్నేళ్ల క్రితం వ్యవసాయ పనులన్నీ కేవలం ఎద్దులతో మాత్రమే చేసేవారు. రానురానూ సాంకేతికత పెరిగిపోవడంతో ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. గతంలో ముందస్తు వర్షాలు కురిస్తే పొలాలను ఎద్దులతో దుక్కి దున్ని పంటను సాగు చేసేందుకు అనువుగా చేసుకునేవారు. గ్రామాల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. గతంలో విత్తనాలు వేసి.. నారుమడులు తయారుచేసి దమ్ము పట్టి నాట్లు వేసేవారు. దీనికి ఎక్కువ మంది కూలీలు అవసరం. ప్రస్తుతం ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో నాట్లుకు బదులుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. గతంలో విత్తనాలను సాగుచేయడం, పంటలో కలుపు మొక్కలను తొలగించడం, మందులను పిచికారీ చేయడం, పంటను తొలగించే పనులు కేవలం మనుషుల ద్వారానే చేసేవారు. ఇప్పుడు విత్తన సాగు చేయడం నుంచి కలుపు తొలగించడం, మందుల పిచికారీ చేయడం, పంటలను కోసేందుకు, నూర్చేందుకు అనేక రకాల పరికరాలను ట్రాక్టర్లుకు అమర్చుకుని మనుషుల ప్రమేయం లేకుండా ఒకరిద్దరితోనే చేసుకుంటున్నారు.

తగ్గిన సేంద్రియ ఎరువులు..

కొన్నేళ్ల క్రితం గ్రామాల్లో వ్యవసాయం చేసే రైతుల ఇళ్ల ముందు ఎద్దులు, పాడి పశువులను పెంచేవారు. పేడను ఎరువుగా మార్చుకుని పంట పొలాలకు వాడేవారు. వీటిద్వారా పండించిన పంటల ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారు. నేడు విత్తనాలను నిల్వ చేసుకోవడం నుంచి పంటలను సాగు చేసి పంట ఇంటికి చేరేవరకు అనేక రకాల రసాయన ఎరువుల వాడకం పెరిగింది. ప్రస్తుతం పశువుల ద్వారా వ్యవసాయం చేసేవారు కనుమరుగయ్యారు. మారుమూల గ్రామాల్లో సైతం వ్యవసాయానికి వాడే పశులు లేవు. యంత్రాల ద్వారానే పంటలను సాగు చేసుకుంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు ద్వారా పండించి పంటలను తింటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నేడు సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది.

నాగలిపట్టి సేద్యం చేసేవారు లేరు..



ప్రస్తుతం ఎక్కడ చూసినా యంత్రాలతోనే వ్యవసాయం చేస్తున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో కాడెడ్లతో వ్యవసాయం చేసేవారు. పంట నూర్పుడి కోసం వివిధ రకాల యంత్రాలు అందుబాటులోకి రావడంతో చాలామంది రైతులు వాటినే వాడుతున్నారు. పశుగ్రాసం కొరత ఎదురవుతోంది. ఎద్దులను పోషించాలంటే భారమవుతుంది.

– ఎ.సింహాచలం, రైతు, కిట్టాలపాడు, హిరమండలం

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీకి చెందిన 25 మంది యువకులు, ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీతో కలిసి పనిచేసిన పలువురు కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఆమదాలవలసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ సమక్షంలో వారంతా చేరారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయడమే మనందరి ధ్యేయమన్నారు. పార్టీలో చేరినవారిలో అన్నెపు సంజయ్‌కుమార్, కూన రాజశేఖర్, పిన్నింటి పవన్, తిర్లంగి కిరణ్, ఎన్ని మురళి, రామకృష్ణ, జి.శ్రీను, సింగుపురం కన్నయ్య, బాలాజీ, పవన్, దివ్వెల వాసు, సీపాన శ్రీనివాసరావుతోపాటు మరికొంతమంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రమణమూర్తి, కూన రామకృష్ణ, పొన్నాడ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..



రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయడానికి అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు నరసన్నపేట మండల కేంద్రానికి ఆదివారం వచ్చాయి. బోర్డు స్కూల్ ఆవరణలోని స్టోర్ రూమ్‌లో పుస్తకాలను భద్రపరిచారు. 31 వేల పుస్తకాలు రావాల్సి ఉండగా.. 20,557 పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ దాలినాయుడు తెలిపారు. ఐదో తరగతి పుస్తకాలు పూర్తిగా రాలేదని, మిగిలిన తరగతులకు చెందిన ప్రధాన పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వర్క్ బుక్స్ రావాల్సి ఉందన్నారు. వచ్చిన పుస్తకాలను స్కూళ్లు తెరిచేలోగా సరఫరా చేస్తామన్నారు. - నరసన్నపేట

శిథిలావస్థలో..



నరసన్నపేట మండలంలోని కొత్తపోలవలస స్కూల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం చుట్టూ ఉన్న గోడలు పాడయ్యాయి. లోపల గోడలు బీటలు రావడంతోపాటు పెచ్చులు ఊడుతున్నాయి. వర్షాలకు పైకప్పు కారుతుంది. ఉన్న ఒక్క గది శిథిలం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పట్ట ప్రభాకరరావు, గ్రామస్తులు కోరుతున్నారు. - నరసన్నపేట

కొబ్బరి బొండాలకు గిరాకీ



వేసవి తాపానికి కొబ్బరి బొండాలపై ప్రజలు ఎక్కువగా ఆధారపడడంతో వ్యాపారులు అమాంతంగా రేట్లు పెంచేస్తున్నారు. మార్కెట్‌లో సాధారణంగా కొబ్బరి బొండం రూ.30 ఉంటే.. పాతపట్నంలో బొండాన్ని ఏకంగా రూ.45 అమ్ముతున్నారు. ప్రజలు ఎండల నుంచి ఉపసమనం పొందేందుకు కొబ్బరి బొండాలను తాగుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు బొండాల రేట్లు పెంచుకుంటున్నారు. - పాతపట్నం

ఆత్మీయ సమ్మేళనం



పొందూరు: 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



పాతపట్నం: 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పొందూరు/ పాతపట్నం/ఆమదాలవలస: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆమదాలవలస మండలంలోని అక్కులపేట జెడ్పీహెచ్ఎస్‌లో 1985 -86లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆమదాలవలస పట్టణంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో అపూర్వ కలయిక ఏర్పాటు చేశారు. ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలను, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



ఆమదాలవలస: 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

తమ్మినాయుడుపేటలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బూర్జ: మండలంలోని తమ్మినాయుడుపేటలో శ్రీకాకుళం మెడికవర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వికాష్, భార్గవి 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేశారు. ఐదుగురికి మెడికవర్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. సర్పంచ్ ఎం.సుదీప్త, గ్రామస్తుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.